సాక్షి
బాపట్ల
సోమవారం, 26, మే, 2025



లక్ష గోవింద నామార్చన హోమం
వినుకొండ: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో అలమేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో లక్ష గోవింద నామార్చన హోమం ఆదివారం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 512.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ముగిసిన వార్షికోత్సవాలు

అమరావతి: అమరావతి గ్రామదేవత పెద్దింటమ్మ తల్లి వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగి, ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


బాపట్ల: ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, ఆ ప్రభావంతో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు కోస్తాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రభావంతో తీర ప్రాంతాలలో 40 నుంచి 60 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.

నృసింహస్వామి సేవలో దేవదాయ శాఖ కమిషనర్



మంగళగిరి: మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ దంపతులు దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన కమిషనర్ దంపతులకు ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందజేశారు.

ముగిసిన హనుమాన్ దీక్షలు



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా హనుమాన్ మండల వ్రత దీక్షలు ఆదివారంతో ముగిశాయి. హనుమత్ హవనము మన్యుసూక్త హోమం, గణపతి హోమం నిర్వహించారు. దీక్షాధారులు ఇరుముడులు ధరించి ఆలయ ప్రదక్షిణలు అనంతరం మాల విరమణ చేశారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా మాస శివరాత్రి గంగా గౌరీ సమేత శంకరునికి ప్రదోషకాల అభిషేకం, కల్యాణ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు కొరపాటి రామారావు, ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్, జిల్లా దేవాలయ పరిరక్షణ సమితి కార్యదర్శి నరేంద్రగౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



తెనాలి: పట్టణ నాజరుపేటలో వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీ శృంగేరీ శ్రీవిరూపాక్ష శ్రీపీఠం శ్రీసదనం శ్రీపరశివానంద భారతీస్వామి ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ కె.చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో స్వామివారి కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుక అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గేట్ మేన్‌పై సస్పెన్షన్ వేటు

నాదెండ్ల: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సాతులూరు రైల్వే గేట్‌మేన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 23న ఉదయం 5 గంటల సమయంలో గుంటూరు నుంచి హుబ్లీ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు 15 నిమిషాలు ఆలస్యమైంది. సాతులూరు సమీపంలో మూడు రైల్వే గేట్లుండగా, 290-291 చందవరం-బుక్కాపురం రోడ్డు వద్ద గేట్లు వేశారు. 289 కనపర్రు రోడ్డు వద్ద వేయకపోవడంతో గూడ్స్ రైలు 15 నిమిషాలు నిలిచిపోయింది. గేట్‌మేన్ నిర్లక్ష్యంపై లోకో పైలట్ గుంటూరు స్టేషన్ మాస్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు గేట్‌మేన్ ఆర్. కోటేశ్వరరావును రైల్వే అధికారులు సస్పెండ్ చేశారు. దీనిపై ముగ్గురు సభ్యుల కమిటీని విచారణకు నియమించారు.



రైతన్నలకు రుణాల రెన్యూవల్ పేరు వింటే కన్నీరే దిక్కవుతోంది. ఇప్పటి వరకు ఏటా బ్యాంకుల్లో రుణాలకు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకునేవారు. కొత్త నిబంధనల పేరుతో బ్యాంకర్లు రుణాలు మొత్తం చెల్లిస్తేనే రెన్యూవల్ అంటూ మెలిక పెట్టడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితుల్లో రుణాలు ఎలా చెల్లించాలో తెలియక నైరాశ్యంలో మునిగిపోయారు. జిల్లాలోని ఏ రైతును కదిలించినా కన్నీటి వెతలే వినిపిస్తున్నాయి. ఒకవైపు ప్రకృతి సహకరించక, మరోవైపు కూటమి ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందక, పంట పండినా గిట్టుబాటు ధరల్లేక కుదేలైన పరిస్థితిలో ఇప్పుడు రుణాల చెల్లింపు పెద్ద సమస్యగా మారింది.

రైతన్నలకు రుణపాశం

- వ్యవసాయ, బంగారు నగలపై రుణాలకు రెన్యూవల్ కష్టాలు
- పూర్తిగా డబ్బులు చెల్లించాలంటూ మెలిక పెడుతున్న బ్యాంకు సిబ్బంది
- గతంలో వడ్డీ చెల్లిస్తే చాలు రెన్యూవల్
- పెట్టుబడి సాయం అందక, గిట్టుబాటు ధరలు లేక ఇప్పటికే రైతులకు కష్టాలు
- కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు రూరల్ మండలానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి అనే రైతు 2021లో బ్యాంకులో బంగారు ఆభరణాలు పెట్టి రూ.80 వేలు రుణం తీసుకున్నారు. మూడు రోజుల క్రితం రెన్యూవల్ కోసం బ్యాంకుకు వెళ్లగా మొత్తం డబ్బు చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని చెప్పారు. దీంతో చేసేదేమీ లేక అప్పు చేసి రూ.1.20 లక్షలు చెల్లించారు. లక్షల మంది అన్నదాతల సమస్య ఇదే. వ్యవసాయం, బంగారు ఆభరణాల పేరుతో తీసుకున్న రుణాలకు రెన్యూవల్ కష్టాలు తప్పడం లేదు. రుణాల చెల్లింపు విషయంలోనైనా కూటమి ప్రభుత్వం స్పందించి మినహాయింపులు ఇవ్వాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. బ్యాంకర్లు అనేక కొర్రీలు పెడుతున్నారని వాపోతున్నారు. బ్యాంకుల్లో తీసుకొన్న అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తేనే రెన్యూవల్ అంటూ మెలిక పెడుతున్నారని పేర్కొంటున్నారు. జిల్లాలో వివిధ బ్యాంకులకు చెందిన 529 బ్రాంచ్‌లు ఉంటే.. వీటిలో 16 లక్షలకుపైగా ఖాతాలు ఉన్నాయి. ఇందులో ఐదు లక్షల ఖాతాలు పంట రుణాలు తీసుకునే రైతులవి. వ్యవసాయ ఆధారిత రుణాల విషయంలో బ్యాంకర్లు చిన్నచూపు చూస్తున్నారు. రెన్యూవల్ పేరుతో రైతులను వేధిస్తున్నారు.

మొత్తం చెల్లిస్తేనే ...

పది శాతం బ్యాంకులు మినహా.. మిగిలినవి రెన్యూవల్ విషయంలో రుణగ్రహీతలను ముప్పుతిప్పలు పెట్టి వేధిస్తున్నాయి. తీసుకున్న రుణానికి ఏడాది గడువు తీరిందని మెసేజ్‌లు రావడంతో బ్యాంకులకు రుణగ్రహీతలు పరుగులు పెడుతున్నారు. అక్కడికి వెళ్లాక రెన్యూవల్ చేసుకోవాలంటే తీసుకున్న మొత్తం డబ్బులు చెల్లించాలని చావు కబురు చల్లగా చెబుతున్నారు. అప్పుడే రెన్యూవల్ చేస్తామని మెలిక పెడుతున్నారు. చాలా మంది అష్టకష్టాలు పడి మొత్తం చెల్లించి రెన్యూవల్ చేయించుకుంటున్నారు. కొన్ని బ్యాంకులు తీసుకున్న రుణాలను పూర్తి స్థాయిలో చెల్లించినా.. మళ్లీ తిరిగి రుణాలు ఇవ్వడంలో రైతులు, రుణగ్రహీతలను ఇబ్బందులు పెడుతున్నాయి. ఎప్పుడెళ్లినా రేపు రమ్మని చెప్పి తప్పించుకుంటున్నాయి. సీ-బిల్, ఈకేవైసీ, ఇతర వివరాలను సాకు చూపి జాప్యం చేస్తున్నాయి.

గతంలో రెన్యూవల్ ఇలా..

గతంలో బ్యాంకుల్లో వ్యవసాయ, బంగారు రుణాలకు రెన్యూవల్‌కు వెళ్తే ఇబ్బందులు పెట్టేవారు కాదు. వడ్డీ వరకు చెల్లించుకుని రెన్యూవల్ చేసేవారు. లేకుంటే భూ విలువ, బంగారం విలువ ప్రకారం తీసుకున్న బ్యాంకు రుణానికి ఏటా 5 నుంచి 10 శాతం వరకు పెంచుతూ వడ్డీ జమ చేసుకునే వారు.

ఏటా నష్టాలు.. అప్పులే..

వ్యాపార లావాదేవీలు, వ్యవసాయం పేరుతో తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు తీసుకుని వడ్డీ వ్యాపారాలు చేసుకునే వారు 30 శాతం మంది ఉన్నారని అంచనా. అలాగే 70 శాతం మంది మాత్రం వ్యవసాయ పనులు నిమిత్తం, బతుకుతెరువు కోసం పట్టాదారు పాసుపుస్తకాలు, బంగారు ఆభరణాలు బ్యాంకుల్లో కుదువపెట్టి రుణాలు తీసుకుంటున్నారు. ఆ రుణాల ద్వారా వ్యవసాయం వృద్ధి చేసుకుంటున్నారు. బోర్లు వేసుకోవడం, కొత్త రకం పంటలు పండించడం, వివిధ రకాల పంటల సాగుకు అవసరమయ్యే ఖర్చులను భరించేందుకు బ్యాంకుల్లో అప్పులు చేస్తున్నారు. ఆపై వాటిని విడిపించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పంట బాగా పండి.. మంచి ధర ఉంటే రైతు వాటిని విడిపించుకునేందుకు వెనకడుగు వేయడం లేదు. ప్రకృతి కాటేయడంతో ఏటా కష్టాలు.. కన్నీళ్లు తప్పడం లేదు. అటు కూటమి ప్రభుత్వం కూడా పెట్టుబడి సాయం అందించడం లేదు. మరోవైపు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ తీవ్ర వైఫల్యం చెందింది. ఇకనైనా దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ రుణ వివరాలు ఇలా..

సీజన్	రుణ లక్ష్యం (రూ.కోట్లలో)	ఇచ్చిన రుణం (రూ.కోట్లలో)
ఖరీఫ్ 2024	5,050	5,189
రబీ 2024-25	3,510	5,839
టర్మ్ లోను	4,073	4,279

మినహాయింపు ఇవ్వాలి



ఆటో కొనుగోలు చేసేందుకు గతేడాది గుంటూరు నగరంలోని ఓ బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి రూ.లక్ష వరకు రుణం తీసుకున్నా. రెన్యూవల్‌కు సంబంధించి మెసేజ్ రావడంతో బ్యాంకు వద్దకు వెళ్లా. అక్కడ మొత్తం చెల్లించాలన్నారు. అవస్థలు పడి మొత్తం డబ్బులు చెల్లించి, 15వ తేదీన రెన్యూవల్ చేయించా. ఈ నిబంధన నుంచి మినహాయించాలి.

–ఎం.నరేంద్ర, గుంటూరు

కొత్త విధానం అమల్లో ఉంది



కొత్త విధానం గతేడాది సెప్టెంబర్ నుంచి అమల్లోకి వచ్చింది. ఆర్బీఐ నిబంధనల ప్రకారం ఇకపై పూర్తి నగదు చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలి. ప్రస్తుతం వడ్డీ మాత్రమే చెల్లించి రెన్యూవల్ చేయించుకునే పద్ధతి లేదు. దీనికి సంబంధించి పలు సమస్యలు వస్తున్నాయి.

– గూడెం మహిపాల్‌రెడ్డి, ఎల్‌డీఎం, గుంటూరు జిల్లా



మాటల్లోనే ఇంపు.. ఊరంతా కంపు

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో అధ్వానంగా పారిశుద్ధ్యం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం పడకేసింది. పాలకుల మాటలు చూస్తే ఎంతో ఇంపుగా ఉంటున్నాయి. ఆచరణలో చూస్తే మాత్రం నగరమంతా దుర్వాసన వచ్చేలా ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా కనిపిస్తోంది. అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా ఫలితం మాత్రం దక్కడం లేదు. ప్రజల ఇబ్బందులు తొలగించాలనే ఆలోచన నిజంగానే ఉంటే శాశ్వత చర్యలు తీసుకుంటేనే సమస్య పరిష్కారం అయ్యే వీలుంటుందని నగరవాసులు పేర్కొంటున్నారు.

- చెత్త తొలగింపులో మున్సిపల్ యంత్రాంగం దారుణంగా విఫలం
- అదనంగా కార్మికులను పెట్టామని చెబుతున్నా ఫలితం అంతంతే
- ఎక్కడ చూసినా గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలతో ప్రజలకు నానా కష్టాలు
- రోజుకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా మెరుగుపడని పరిస్థితి
- ప్రజారోగ్యంపై ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో రోజురోజుకూ పెరుగుతున్న చెత్త సమస్య



శారదాకాలనీలో రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్త

నెహ్రూనగర్: నగరంలో ఎక్కడా గార్బేజ్ పాయింట్లు ఉండటానికి వీల్లేదని.. అవి కనిపిస్తే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలే బాధ్యత వహించాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. కానీ నగరంలోని పలు చోట్ల గార్బేజ్ పాయింట్లు కనిపిస్తూనే ఉన్నాయి. సకాలంలో ఇంటింటి చెత్త సేకరణ జరగకపోవడంతోపాటు పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానం ఉంది. ఎక్కడ చూసినా వ్యర్థాల కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో చెత్తను రోడ్లపై వేయకుండా గ్రీన్ పట్టాలు కట్టించారు. దీనివల్ల కూడా ఉపయోగం కనిపించడం లేదు. ఫిర్యాదులు రావడంతో కమిషనర్ పులి శ్రీనివాసులు చెత్త వేసే వారిని గుర్తించి వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. పేరుకుపోయిన చెత్తను మాత్రం తొలగించే మార్గాలు అన్వేషించడం లేదు.

నామమాత్రంగా పర్యవేక్షణ

నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు కోసం ప్రత్యేకంగా అధికారులను కేటాయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలతోపాటు ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. ఇంత చేసినా ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదు. పర్యవేక్షణ నామమాత్రంగా మారడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం సుమారు 2 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. నెల రోజుల క్రితం అప్కాస్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల వయస్సు 60 ఏళ్లు దాటిందనే సాకుతో వారిని విధుల నుంచి తొలగించారు. వారి స్థానంలో కొత్త వారిని తీసుకోకపోవడంతో మిగిలిన వారిపై పని భారం పడుతోంది. దీంతో పారిశుద్ధ్యం ఆశించిన స్థాయిలో లేదు. స్వచ్ఛభారత్ – స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో నగరానికి మెరుగైన స్థానం సాధించేందుకు డంపర్ బిన్లను తొలగించిన విషయం తెలిసిందే. దీంతో చెత్తను సకాలంలో తరలించేందుకు నగర పరిధిలో 39 ట్రాక్టర్లు, 18 కంప్యాక్టర్ బిన్లను వినియోగిస్తున్నారు. అవసరం పేరుతో అదనంగా కొన్ని ట్రాక్టర్లు అద్దెకు కూడా తీసుకున్నారు. నగరంలో ఉత్పన్నమయ్యే చెత్తను రోడ్ల మీద వేయకుండా ఎప్పటికప్పుడు తరలించాలని కమిషనర్ ఆదేశాలకే పరిమితం అయ్యారు. చెత్త మాత్రం రోడ్డు మీద కనిపిస్తూనే ఉంది. దీనిపై ప్రజారోగ్యధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

శాశ్వత చర్యలు తీసుకుంటేనే..

2011 లెక్కల ప్రకారం నగరంలోని 7.50 లక్షల జనాభాకు అనుగుణంగా ప్రస్తుతం కార్మికులు పనిచేస్తున్నారు. 2012లో 10 గ్రామ పంచాయతీలను నగరపాలక సంస్థలో విలీనం చేశారు. దీంతో జనాభా మరింత పెరిగింది. ఇప్పుడు నగరంలో సుమారు 11 లక్షల మంది ఉన్నారని అంచనా. ఇళ్ల సంఖ్య సుమారు 3 లక్షల వరకు ఉంది. 2011 జనాభాకు తగ్గట్లుగా 2 వేల మంది మాత్రమే కార్మికులు ప్రస్తుతం పనిచేస్తున్నారు. గతంలో నగరంలో రోజుకు 400 మెట్రిక్ టన్నుల చెత్త వచ్చేది. ప్రస్తుతం 470 మెట్రిక్ టన్నులకు ఇది పెరిగింది. ఇంత చెత్తను బయటకు తీసుకెళ్లేందుకు కార్మికులు చాలా అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రజల నుంచి చెత్త సమస్యలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. కమిషనర్ పులి శ్రీనివాసులు అదనంగా 225 మంది కార్మికులను నిత్యం రూ.500 చొప్పున ఇచ్చేలా నియమించారు. వీరిలో ఎక్కువమంది నామమాత్రంగా పనులు చేసుకుంటూ వెళ్లిపోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రధానమైన ప్రాంతాల్లోనే పారిశుద్ధ్యం మెరుగ్గా చూపించి, ఇతర కాలనీల్లో గాలికొదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేలా చూడకుండా పైపైన అధికారుల స్థాయిలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా ప్రయోజనం కనిపించదని నగరవాసులు పేర్కొంటున్నారు. తగినంతమంది సిబ్బందిని నియమించి, పర్యవేక్షణ సక్రమంగా చేస్తేనే చెత్త సమస్యల నుంచి ప్రజలకు ఉపశమనం లభించే అవకాశం ఉంది.

గుంటూరు నగరపాలక సంస్థ సమాచారం

గృహాల సంఖ్య	: సుమారు 3 లక్షలు
శానిటరీ డివిజన్లు	: 32
మైక్రో ప్యాకెట్లు	: 802
నిత్యం వచ్చే చెత్త	: 470 మెట్రిక్ టన్నులు
వార్డు సచివాలయాలు	: 207
పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య	: 2,000
ట్రాక్టర్లు	: 39

అమ్మసన్నిధి.. భక్తజన సందడి

- దుర్గగుడిలో ఉదయం 11.30 నుంచి వీఐపీ దర్శనాలు నిలిపివేత



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవి సెలవులు, పెద్ద సంఖ్యలో వివాహాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. దీంతో క్యూలు కిటకిటలాడుతూ కనిపించాయి. మహా మండపం రెండో అంతస్తులో దేవస్థానం ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీ మరింత పెరగడంతో ఘాట్‌రోడ్డు పైకి కార్లను అనుమతించలేదు. మధ్యాహ్నం మహా నివేదన నిమిత్తం 11.40 నుంచి 12.15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. భక్తుల రద్దీ ఉండే సమయాల్లో వీఐపీ దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో శీనానాయక్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆదివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వీఐపీ దర్శనాలు నిలివేశారు. ప్రముఖులు, అధికారుల పేరిట వచ్చిన వారికి ఈవో ఆదేశాలను వివరించారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత వీఐపీ దర్శనాలకు అనుమతించారు.

టికెటు ఉంటేనే అంతరాలయ దర్శనం

రూ. 500 టికెటు ఉన్న వారికి మాత్రమే అంతరాలయంలోకి అనుమతించారు. ఆదివారం ఉదయం ఈవో శీనానాయక్ పలుమార్లు టికెట్ల స్కానింగ్, చెకింగ్ పాయింట్లను తనిఖీ చేశారు. ప్రముఖుల సిఫార్సులతో దర్శనానికి విచ్చేసిన వారిని ప్రొటోకాల్ కార్యాలయానికి వెళ్లి టికెట్లు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. రద్దీ నేపథ్యంలో వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక సమయం కేటాయింపు దిశగా ఈవో చర్యలు చేపట్టారు. అమ్మవారి దర్శనం పూర్తయిన భక్తులు నటరాజ స్వామి ఆలయం, సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయం వద్ద సేద తీరగా ఈవో శీనానాయక్ వారిని కలిసి మాట్లాడారు.

యోగాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి

నరసరావుపేట: యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా ప్రజలందరి భాగస్వామ్యం పెద్దఎత్తున కావాలని జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో యోగాంధ్ర పోటీలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల వారీగా ప్రతిరోజు ఉదయం ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మున్సిపాలిటీల్లో యోగా స్ట్రీట్ ఏర్పాటుచేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నిర్వహించాలని తెలిపారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగాలో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్, వెబ్‌సైట్ ద్వారా నమోదు కావాలని ఆయన కోరారు. సమీపాన ఉన్న గ్రామ, వార్డుల ప్రాంతాలలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాల వద్ద కూడా పాల్గొనవచ్చునని తెలిపారు.

క్లుప్తంగా

సమ్మె విరమించిన సీహెచ్ఓలు

నరసరావుపేట: తమ డిమాండ్ల సాధన కోసం స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్కు వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్ఓ) చేస్తున్న సమ్మెను ఆదివారంతో విరమించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇచ్చిన హామీతో తామంతా గత 27రోజులుగా చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు అనుపమ ప్రకటించారు. తమకు సహకరించిన జిల్లా, స్థానిక అధికారులు, మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాలు, గాంధీ స్మారక సమితి నాయకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా వర్షం

- ప్రత్తిపాడులో 27.4 మి.మీ.వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 27.4 మిల్లీ మీటర్లు వర్షం కురవగా, అత్యల్పంగా మంగళగిరి మండలంలో 9.6 మి.మీ వర్షం కురిసింది. సగటున 17.9 మి.మీ వర్షపాతం నమోదైంది. మే నెల 25వ తేదీ వరకు జిల్లా సాధారణ వర్షపాతం 48.2 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 184.7 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు తూర్పు 26.4 మి.మీ., ఫిరంగిపురం 25.2, గుంటూరు పశ్చిమ 24.2, దుగ్గిరాల 22.6, తెనాలి 22.4, పెదకాకాని 21.4, పొన్నూరు 20.6, కొల్లిపర 17.4, పెద నందిపాడు 15.6, చేబ్రోలు 15.4, వట్టిచెరుకూరు 14, కాకుమాను 13.8, తాడికొండ 12.6, మేడికొండూరు 11.4, తాడేపల్లి 11.4, తుళ్లూరు మండలంలో 10.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

తిరునాళ్లలో 'మైక్ అనుమతి' నిరాకరణ

- వైఎస్సార్‌సీపీకి గ్రామస్తులు అనుకూలమని పక్షపాతం
- రేపల్లె రూరల్ పోలీసుల అత్యుత్సాహం
- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆగ్రహం
- నిరసన తెలిపిన తర్వాత ఎట్టకేలకు డీఎస్పీ ఆదేశాలతో మైక్ అనుమతి



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: పొన్నపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ కార్యమ్మరమ్మ వారి తిరునాళ్లకు మైక్ అనుమతి ఇవ్వకుండా స్థానిక పోలీసులు అడ్డుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని పొన్నపల్లి గ్రామంలో ఎక్కువ శాతం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. 95 శాతం మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఉన్నారు. పది రోజులు క్రితం మైక్ అనుమతి కోసం గ్రామ పెద్దలు మీ–సేవ ద్వారా చలానా తీశారు. స్థానిక ఎస్ఐ అనిల్‌కుమార్‌ను నాలుగు రోజులుగా పొన్నపల్లి గ్రామస్తులు సంప్రదిస్తూనే ఉన్నారు. గ్రామంలో గొడవలు జరుగుతాయనే సమాచారం ఉందని, అందుకే మైక్ పర్మిషన్ ఇవ్వలేమని చెప్పడం గమనార్హం. దీంతో ఆదివారం వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. రేపల్లె రూరల్ సీఐ సురేష్‌బాబును, ఎస్ఐ అనిల్ కుమార్‌ను దీనిపై సంప్రదించినా అనుమతికి ససేమిరా అన్నారు. వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు, డాక్టర్ ఈవూరి గణేష్ తదితరులు గ్రామస్తులతో కలిసి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. దీంతో కొంతసేపు పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ.. గ్రామంలోని వారు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని, కూటమి నేతల ఆదేశాల మేరకే స్థానిక పోలీసులు అనుమతి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి తిరునాళ్ల సంతోషంగా జరుపుకోవటానికి మైక్ అనుమతి ఇవ్వాలని కోరారు. సమాచారం తెలుసుకున్న రేపల్లె డీఎస్పీ అవల శ్రీనివాసరావు వచ్చి డాక్టర్ ఈవూరి గణేష్‌తో చర్చించారు. దీంతో మైక్ పరిమిషన్ వచ్చింది. దీనిపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వరుకూటి అశోక్ బాబు, డాక్టర్ ఈవూరి గణేష్‌లు అమ్మవారిని కార్యకర్తలతో కలిసి దర్శించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎంఏ హైస్కూలు క్రీడా మైదానంలో సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగాలలో జిల్లా స్థాయి జట్లను ఎంపిక చేశారు. ప్రతిభఆధారంగా వీరిని ఎంపిక చేసినట్లు బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. విజయకుమార్, కోఆర్డినేటర్ ఎన్. దేవదాసు, సమ్మర్ క్యాంప్ ఇన్‌చార్జి బి.ప్రేమయ్య, కోచ్ ప్రసన్నకుమార్ తెలిపారు. బాలురకు సంబంధించి అండర్–13, అండర్–15లలో 22 మంది చొప్పున ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. సీనియర్ క్రీడాకారుడు ఎన్. నరేష్, రమ్మికుమార్, ఎస్.బాలశౌరి, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కారుమూరు



వేమూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గానికి చెందిన కారుమూరు వెంకట రెడ్డిని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం ఆదివారం ప్రకటన జారీ చేసింది. చుండూరు మండలంలోని కారుమూరుపాలెం గ్రామానికి చెందిన కారుమూరు వెంకట రెడ్డి డిబేట్స్ విశ్లేషకులుగా, పార్టీలోనూ అనేక పదవులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పని చేశారు. నియోజకవర్గంలో కేవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కారుమూరు వెంకట రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు ప్రోత్సాహంతో తనకు పదవి లభించిందని తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

వేటపాలెం: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ పరిధి విఘ్నేశ్వర కాలనీ దగ్గర ఇసుక క్వారీలో ఆదివారం చోటు చేసుకుంది. కొత్తపేటలోని మూడు రోడ్ల దగ్గలో నివాసం ఉండే పిగిలి వాసు (38) తన ట్రాక్టర్‌తో ఇసుక క్వారీ వద్దకు వెళ్లాడు. ట్రాక్టర్‌ను క్వారీ వద్ద నిలిపి ఇసుక లోడ్ చేసుకునే సమయంలో కిందికి దిగాడు. ట్రాక్టర్ ఓ కుప్ప నుంచి ముందుకు దొర్లుకుంటూ పోతుండటంతో వాసు ట్రాక్టర్‌పైకి ఎక్కి దానిని ఆపేందుకు ప్రయత్నించాడు. ప్రమాదవ శాత్తు జారి ట్రాక్టర్ టైరు కింద పడిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న వారు గమనించి చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళల తెనాలికి ఆభరణం కాటూరి శిల్పకళ

సత్కార సభలో ప్రముఖుల అభినందన



కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలను సత్కరిస్తున్న ప్రముఖులు

తెనాలి: వంశ పారంపర్యంగా వస్తున్న శిల్పకళను కొనసాగిస్తూ అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొస్తున్న శిల్ప కళాకారులు కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు రవిచంద్ర, శ్రీహర్షలు తెనాలికి గర్వకారణమని పలువురు వక్తలు అభినందించారు. ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ హాలులో జరిగింది. సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. రాష్ట్రప్రభుత్వ 'కళారత్న' అవార్డు గ్రహీత కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షను ఈ వేదికపై సత్కరించారు. తెనాలిలో తొలిసారిగా శిల్పకళపై నిర్వహిస్తున్న కాటూరి ఆర్ట్ గ్యాలరీ, తండ్రీకొడుకుల శిల్పకళానైపుణ్యానికి నిదర్శనమని డాక్టర్ రామ్‌చంద్ అన్నారు. శిల్పకళలో తెనాలి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన శిల్పకారులను సత్కరించిన మానవత విధిగా భావించినట్లు తెలిపారు. సత్కారగ్రహీత కాటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తండ్రీకొడుకులు ముగ్గురికీ ఒకే వేదికపై అభినందన గౌరవం మరచిపోలేనిదని చెప్పారు. తండ్రి కోటేశ్వరరావు నుండి వచ్చిన శిల్పకళను గురువు అంచే రాధాకృష్ణమూర్తి శిక్షణలో మెరుగుపరచుకున్నట్టు సోదాహరణంగా చెప్పారు. బీఎఫ్ఏలో పీజీ చేసిన రవిచంద్ర ఇనుప వ్యర్థాలకు శిల్పకళా సొయగాలు కల్పిస్తుంటే, శ్రీహర్ష త్రీడీ, ఏఐ టెక్నాలజీని జోడిస్తూ కళాత్మక ఉట్టిపడేలా చేస్తుండటం తమ అదృష్టమన్నారు. ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ నేతృత్వంలో ప్రదర్శించిన 'తల్లికి వందనం' కార్యక్రమం ఆకట్టుకుంది. ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, డీవీ సోమయ్యశాస్త్రి, కూరపాటి కల్యాణి, మొవ్వా సత్యనారాయణ, ముత్తేవి రవీంద్రనాథ్, అయినాల మల్లేశ్వరరావు, వెంపటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృత్యువాత

మరో మహిళకు తీవ్ర గాయాలు

మాచవరం: ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా, మరో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పిల్లుట్లలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లుట్ల గ్రామానికి చెందిన కాంద్రకుంట ఐశ్వర్య (33), కామినేటి సుజాతలతో పాటు మరి కొంత మహిళలు పొలం పనుల నిమిత్తం రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో నర్రా బాలు పిడుగురాళ్ల వైపు నుంచి ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వస్తూ వారిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ఆసుపత్రికి తరలిస్తుండగా కాంద్రకుంట ఐశ్వర్య (33) మృతి చెందింది. తీవ్ర గాయాలైన సుజాతను పిడుగురాళ్ల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.రోశయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కృష్ణా నదిలో వ్యక్తి గల్లంతు

పోలీసుల ముమ్మర గాలింపు



అచ్చంపేట: కృష్ణా నదిలో వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని గింజుపల్లి వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా, నకరికల్లు మండలం, చాగల్లు గ్రామానికి చెందిన ఆలపరి సైదారావు(43) మరికొంత మందితో ఆదివారం ఉదయం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకుని మాదిపాడు పంచాయతీ పరిధిలోని సత్తెమ్మ తల్లి దేవాలయానికి వచ్చారు. మధ్యాహ్నం వరకు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుని, కానుకలు సమర్పించి అక్కడే భోజనాలు వండుకుని తిన్నారు. సుమారు మూడు గంటల సమయంలో సమీపంలోని గింజపల్లి వద్ద కృష్ణానదిలో సరదాగా ఈత కొట్టేందుకు మరో 10మందితో దిగాడు. సైదారావు నది లోతుల్లోకి వెళ్లిపోగా దగ్గరలో ఉన్నవారు రక్షించే ప్రయత్నం చేసినా ఫలించ లేదు. విషయం తెలుసుకున్న అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈతగాళ్ల సహాయంతో చేపల పడవల ద్వారా ఆదివారం రాత్రి 7గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోయింది. మృతుడు కూలి పనే వృత్తిగా జీవిస్తుంటాడు. సైదారావుకు భార్య, బీటెక్ చదివే కుమార్తెలు ఇద్దరు ఉన్నారు.

సంపులో పడి బాలుడు మృతి



బాలుడు జారి పడిన సంపు

లక్ష్మీపురం: సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. గుంటూరు కొత్తకాలనీకి చెందిన ఒడిశా వాసుల కుమారుడు రాఘవకుమార్ (5) ఆడుకుంటూ ఓ సంపులో పడి ప్రాణాలు కోల్పోయాడు. నీటి కోసం తవ్విన సంపుకు ఎటువంటి రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో బాలుడు ప్రమాదవశాత్తు అందులో జారి పడ్డాడు. అయితే కుటుంబ సభ్యులుకు బాలుడు కనిపించకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాలలో గాలింపు ప్రారంభించారు. తీరా సంపులో పరిశీలించగా బాలుడు రాఘవకుమార్ సంపులో పడి ఉన్నాడు. దీంతో హుటాహుటిన బాలుడిని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించగా బాలుడి కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదులు చేయబోమని, ఎలాంటి పోస్ట్‌మార్టం అవసరం లేదని చెప్పి బాలుడి మృత దేహాన్ని తీసుకువెళ్లారు.

నాలుగు పర్యాటక ప్రదేశాల్లో యోగా ప్రదర్శన

- 5న రాష్ట్ర స్థాయి కార్యక్రమం
- కొనసాగుతున్న శిక్షణ



పెద్దచెరువు కలెక్టరేట్ బంగ్లా వద్ద రోడ్డుపై ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ అధికారులు

నరసరావుపేట: యోగాంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి ఒక్కరికీ యోగా గొప్పతనాన్ని వివరించి వారితో ఆసనాలను వేయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనీలు, టీఓటీలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండో రోజు ఆదివారం కూడా శిక్షణ కొనసాగింది. ఆన్‌లైన్ ద్వారా జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. ఇందులో యోగా గురువులు, టీఓటీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాలో నాలుగు పర్యాటక ప్రాంతాల్లో భారీస్థాయిలో యోగా ప్రదర్శించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. దీని ప్రకారం ఈనెల 28న కోటప్పకొండ, జూన్ 5న నాగార్జునసాగర్, 11న కొండవీడు కోట, 18న అమరావతి వద్ద ప్రదర్శనలు నిర్వహించనున్నారు. అంశాల ప్రాతిపదికగా ప్రతి జిల్లాకు ఒక థీమ్‌ను ప్రభుత్వం కేటాయించింది. దీనిలో భాగంగా జిల్లాలో వేలాది మంది ఏఎన్ఎం, ఆశా వర్కర్లు వర్కర్లతో జూన్ ఐదున యోగా ప్రదర్శనను నిర్వహించడానికి అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శిక్షణ పొందినవారితో బాటు, సామాన్య ప్రజలు సైతం ఈ యోగా స్ట్రీట్‌కి వచ్చి ఆసనాలను అభ్యాసం చెయ్యవచ్చు. పోలీసు శాఖ అధ్వర్యంలో సోమవారం ఉదయం నరసరావుపేటలోని కలెక్టర్ బంగ్లా రోడ్డు వద్ద ప్రధాన రహదారిపై యోగా ప్రదర్శన నిర్వహించడానికి ఏర్పాటు చేశారు.

ముగిసిన ప్రసన్నాంజనేయుడి జయంత్యుత్సవాలు

చివరి రోజు లక్ష మల్లెలతో స్వామికి అభిషేకం



అలంకరణలో స్వామివారు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి జయంతి, కల్యాణ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. చివరి రోజున స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయాన్నే ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వెంకట అనంతాచార్యులు స్వామికి సుప్రభాత సేవలతో పూజలు ప్రారంభించారు. అనంతరం లక్ష మల్లె పూలతో విశేష పూజలను నిర్వహించారు. చివరి రోజు భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామికి పొంగళ్లు చేసి, నైవేద్యాలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. రాత్రి రాజుపాలెం గ్రామానికి చెందిన శ్రీ అంకమ్మ తల్లి కళా నాట్యమండలి వారి శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. ఆదివారం ఆలయంలో హుండీని లెక్కించగా జనవరి నుంచి ఈ నెల 25 వరకూ హుండీ ద్వారా రూ. 3,28,366 ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు సహకరించిన అందరికీ ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తలిపారు. ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

గురుకుల కళాశాలల్లో సీట్ల భర్తీకి నేటి నుంచి కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థచే నిర్వహిస్తున్న గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర రీజియన్ కన్వీనర్ పి.సాంబశివరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్లో 26న ఎంపీసీ, ఐఐటీ, 27న బైపీసీ, సీజీటీ, 28న ఎంఈసీ, సీఈసీ గ్రుపులకు నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా 1:5 నిష్పత్తిలో విద్యార్థులను ఎంపిక చేసి జాబితాలను aprs.apcfss.in సైట్‌లో ఉంచనున్నట్లు వివరించారు. కౌన్సెలింగ్‌కు అర్హత పొందిన విద్యార్థులు వెబ్ సైట్ నుంచి కాల్ లెటర్ డౌన్లోడ్ చేసుకుని హాజరు కావాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థినులు, విద్యార్థులకు నిమ్మకూరులోని కో–ఎడ్యుకేషన్, తాటిపూడిలోని బాలికల జూనియర్ కళాశాల, వాయల్పాడులోని మైనారిటీ బాలికల కళాశాలల్లో సీట్ల కోసం ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బాలురకు నిమ్మకూరులోని కో–ఎడ్యుకేషన్, నాగార్జునసాగర్, వెంకటగిరి ఏపీఆర్జేసీ జూనియర్ కళాశాలతోపాటు గుంటూరులోని ఏపీఆర్జేసీ మైనారిటీ బాలుర కళాశాలలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. వృత్తి విద్యా కోర్సులకు కృష్ణా జిల్లాలోని నిమ్మకూరు కళాశాలను ఎంపిక చేసుకోవచ్చునని పేర్కొన్నారు. నాగార్జున సాగర్ డిగ్రీ కళాశాల ప్రవేశాలకు కౌన్సెలింగ్‌కు అర్హత సాధించిన విద్యార్థులు కాల్ లెటర్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని గుంటూరు పొన్నూరు రోడ్డులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల పక్కన ఉన్న మైనారిటీ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 30న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. ఏపీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతితో పాటు 6,7,8వ తరగతుల్లో మిగులు సీట్లు ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల ప్రొవిజినల్ సెలక్షన్ ఆర్డర్లు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. సీటు సాధించిన విద్యార్థులు వెబ్‌సైట్‌లో బీ సెలక్షన్ ఆర్డరు డౌన్లోడ్ చేసుకుని ఈ నెల 21 నుంచి 30వ తేదీలోపు వారికి కేటాయించబడిన పాఠశాలల్లో సర్టిఫికెట్లు సమర్పించి ప్రవేశాలు పొందాలని తెలిపారు.

మృతదేహాలు కుటుంబానికి అప్పగించకపోవడం దారుణం

చీరాల: నారాయణ్‌పూర్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా అడ్డుకుంటున్న కూటమి ప్రభుత్వ విధానాలు అత్యంత గర్హనీయమని పలువురు ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకులు మాచర్ల మోహనరావు, పీడీఎం కార్యదర్శి కె.వెంకటేష్, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.అంజమ్మ, పౌర హక్కుల సంఘం కార్యదర్శి వీరాంజనేయులు, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు దీనికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన నంబాల కేశవరావు, సజ్జా వెంకట నాగేశ్వరరావు, విజయలక్ష్మి, సంగీత, వివేక్‌ల మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు రోజుల తరబడి నారాయణపూర్ గవర్నమెంట్ హాస్పిటల్, పోలీసుల చుట్టు తిరుగుతున్నా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో బీజేపీ కూటమి పాలనలో దేశం ఎటు పోతోందో అర్థం కాని దౌర్భాగ్యస్థితి దాపురించిందన్నారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల మృతదేహాలపై రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. మృతదేహాలను త్వరగా కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

మది దోచిన సంగీత, నాట్య కళారూపాలు



మూషిక వాహన ప్రదర్శనలో చెన్నైకు చెందిన హలైనా పోకిష



గణపతి కౌతం ప్రదర్శిస్తున్న హైదరాబాద్ వాసి అభిద్య లకర



నటేశ్వర కౌతం ప్రదర్శిస్తున్న హైదరాబాద్‌కు చెందిన భువిక



శంకర శ్రీగిరి ప్రదర్శిస్తున్న హైదరాబాద్‌కు చెందిన వనీష

రెండో రోజు కొనసాగిన కళానిలయం జాతీయస్థాయి పోటీలు

చిలకలూరిపేట: కన్నుల పండువగా సంప్రదాయ నృత్యాలు, వీనుల విందుగా సుమధుర సంగీత కీర్తనలు, నాట్య కళాకారుల ఉత్సాహపూరిత ప్రదర్శనల మధ్య కళా నిలయం 40వ జాతీయ స్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళా రూపాల పోటీలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. పోటీలకు వేదికైన పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో భరతనాట్యం, కూచిపూడి పోటీలు సూర్య, చంద్ర విభాగాల్లో రసవత్తరంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కాళ్లకు గజ్జెలు కట్టి ,చక్కటి హావభావాలతో నాట్యకళ ప్రదర్శించి, నటరాజ వారసులమని నిరూపించారు. కీర్తన, మూషిక వాహన, గణపతి కౌతం, వినాయక కౌతం, ముద్దుగారే యశోద, బాలగోపాల తరంగం, బ్రహ్మాంజలి, దశావతార శబ్దం,జనుత శబ్దం,కొండలలో నెలకొన్న, భామాకలాపం, నరసింహ వైభవం, హిమగిరి తనయ, అలవేల్ మంగ వంటి కీర్తనలకు లయబద్ధంగా నర్తించారు. రసజ్ఞులైన ప్రేక్షకులను రంజింపచేసి వారి ప్రశంసలను అందుకున్నారు. ఒకవైపు పోటీలు కొనసాగిస్తూనే మరోవైపు నాట్యకళ బోధించిన నాట్యాచార్యులకు సన్మానాలు నిర్వహించి వారి ఆశీస్సులు పొందారు. ముందుగా కళానిలయం నిర్వాహకుడు ప్రగడ రాజమోహనరావు సతీమణి శివసత్యనారాయణమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి పూజ నిర్వహించారు. నేటి కార్యక్రమాలు సూర్య, చంద్ర విభాగాల్లో జానపద నృత్య పోటీలతో పాటు శాస్త్రీయ జంట నాట్యాలు, అశాస్త్రీయం జంట నాట్యాలు, శాస్త్రీయ బృంద నాట్యాలు, అశాస్త్రీయ బృంద నాట్యాలు, శాస్త్రీయ నృత్యనాటికల పోటీలు సోమవారం నిర్వహిస్తారు. వీటితో పాటు నాట్యాచార్యులకు సన్మానాలు ఉంటాయి.

ఆకట్టుకున్న నాటికలు

నాదెండ్ల: మండలంలోని సాతులూరులో నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ జాతీయ నాటికల పోటీలు ఆదివారం రెండో రోజు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి కురిసిన వర్షంతో గుంటూరు ఆరాధన ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరగాల్సిన 'మరీ అంతొద్దు' నాటిక ప్రదర్శన నిలిచిపోయింది. ఆదివారం తొలిగా ప్రదర్శించారు. అనంతరం కొలకలూరి శ్రీసాయి ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'జనరల్ బోగీలు' నాటికను ప్రదర్శించారు. పీటీ మాధవ్ రచనకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. విశాఖపట్నం భద్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'దొందూ దొందే' నాటిక ప్రదర్శించారు. రచనా దర్శకత్వం డేవిడ్‌రాజు వహించారు. ఏలూరు హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సారీ రాంగ్ నంబర్' నాటికకు రచయితగా చింతల మల్లేశ్వరరావు, దర్శకుడిగా మహమ్మద్ ఖాజావలి వ్యవహరించారు. సామాజిక రుగ్మతలు, సందేశాలను నాటికలు ప్రస్ఫుటించాయి. జ్యోతి ప్రజ్వలన బండారుపల్లి మస్తాన్‌రావు, సభా పరిచయం నడింపల్లి వెంకటేశ్వరరావు చేయగా, సభాధ్యక్షత గరికపాటి వెంకట రామారావు వహించారు.

నేటి ప్రదర్శనలు: బాపట్ల సహృదయ ద్రోణాదుల వారి 'వర్క్‌ఫ్రం హోమ్', సాతులూరు వజ్జా రామనాథం ఆర్ట్స్ 'రారాజు సుయోధన', వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక 'ఏకాకి' ప్రదర్శనలు నిర్వహించనున్నారు.